క్లుప్తంగా

మహనీయుల యాదిలో జ్ఞానమాల కార్యక్రమం



మాట్లాడుతున్న నాయకులు

జ్యోతినగర్: ఎన్టీపీసీ రామగుండం ఎఫ్‌సీఐ క్రాస్ రోడ్‌లోని అంబేడ్కర్ విగ్రహానికి ఆదివారం పూలమాల వేసి జ్ఞానమాల కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా బహుజన సంఘాల నాయకులు మాట్లాడారు. ముఖ్య అతిథులుగా కాంగ్రెస్ మూడో డివిజన్ అధ్యక్షుడు ఈదునూరి మల్లేశ్, మాజీ కార్పొరేటర్ కుమ్మరి శ్రీనివాస్, సానాపూరి శ్రీనివాస్, చింతల సత్యం, ఆల్ ఇండియా అంబేడ్కర్ యువజన సంఘం జిల్లా కోకన్వీనర్ పెగడపల్లి నారాయణ, ఆలయ ఫౌండేషన్ సీఈవో రమేశ్ బాబు, ఆల్ ఇండియా అంబేడ్కర్ యువ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు మైస రాజేశ్, సమతా సైనిక్‌దళ్ రాష్ట్ర నాయకులు దుర్గం నగేష్, లంబాడి హక్కుల పోరాట సమితి రాష్ట్ర నాయకులు సురేశ్, నాగభూషణం, బహుజన సంఘాల నాయకులు, ఆల్ ఇండియా అంబేడ్కర్ సంఘ యువజన సంఘం నాయకులు పాల్గొన్నారు.

అంబేడ్కర్ ఆశయ సాధనకు కృషి చేయండి



పూలమాల వేస్తున్న నాయకులు

యైటింక్లయిన్‌కాలనీ: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని రామగిరి మండలం వెంకట్రాపల్లి మాజీ ఎంపీటీసీ శనిగరం తిరుపతి, ఆల్ ఇండియా అంబేడ్కర్ సంఘం జిల్లా నాయకుడు బూడిద సమ్మయ్య కోరారు. అంబేడ్కర్, పూలే జ్ఞానమాల కార్యక్రమంలో భాగంగా ఆదివారం యైటింక్లయిన్‌కాలనీ షాపింగ్ కాంప్లెక్స్ చౌరస్తాలోని అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. అన్నివర్గాల ప్రజలకు న్యాయం జరిగేలా రాజ్యాంగాన్ని రచించిన అంబేడ్కర్ గొప్ప నాయకుడని పేర్కొన్నారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ శంకర్ నాయక్, సురేశ్, రమేశ్, శంకర్, మహేశ్, సదానందం, కుమారస్వామి, వీరారెడ్డి, దశరథం, దుర్గాప్రసాద్ పాల్గొన్నారు.

ప్రారంభానికి సిద్ధంగా కేడీసీసీ బ్యాంక్



ప్రారంభానికి సిద్ధమైన కేడీసీసీబీ

సుల్తానాబాద్: మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్ వెనుక వైపు కేడీసీసీ బ్యాంక్ ప్రారంభానికి సిద్ధమైంది. అధునాతన సౌకర్యాలు, బ్యాంకుల్లో వచ్చిన మార్పులకు అనుగుణంగా నిర్మాణం పూర్తి చేసి త్వరలోనే ప్రారంభించనున్నట్లు అధికారులు తెలిపారు. బ్యాంకులో రైతులకు లాకర్ సిస్టంతో పాటు కమర్షియల్ బ్యాంకులకు దీటుగా సేవింగ్, రికరింగ్ డిపాజిట్‌ల తోపాటు కరెంట్ అకౌంట్, సేవింగ్ అకౌంట్ లోనింగ్ సిస్టమ్ సైతం అందుబాటులో ఉండేలా ఏర్పాట్లు చేస్తున్నారు. బ్యాంకు ముందు భాగంలో ఏటీఎం సైతం అందుబాటులో ఉంది. మొబైల్ బ్యాంకింగ్ సౌకర్యం సైతం అందుబాటులోకి తీసుకురానున్నారు. పనులన్నీ పూర్తయ్యాయని, కానీ ఎలక్షన్ కోడ్ ఉందని ప్రారంభించలేదని సింగిల్‌విండో చైర్మన్ శ్రీగిరి శ్రీనివాస్ తెలిపారు.

'ఎన్టీపీసీ రామగుండం'లో నాగుపాము హల్‌చల్



నాగుపామును పట్టుకున్న స్నేక్ క్యాచర్ షఫీ

జ్యోతినగర్: ఎన్టీపీసీ రామగుండం ప్రాజెక్టులో నాగుపాము హల్‌చల్ చేసింది. ప్రాజెక్టులోని యూనిట్-6 షిఫ్ట్ ఆపరేషన్ లొకేషన్ బాటం యాష్ వద్ద ఆదివారం నాగుపాము కనిపించింది. దీంతో పని ప్రదేశంలో విధులు నిర్వహిస్తున్న సూపర్‌వైజర్ కృష్ణమూర్తి కంట్రోల్ రూం షిఫ్ట్ ఇన్‌చార్జికి సమాచారం అందించారు. వెంటనే స్పందించిన అధికారులు స్నేక్ క్యాచర్ ఎండీ షఫీకి సమాచారం అందించి పని ప్రదేశానికి పంపించారు. షఫీ పామును పట్టుకున్నారు. పని ప్రదేశాల్లో జాగ్రత్తగా ఉండాలని అధికారులు కార్మికులకు సూచించారు.

'ఆహార భద్రత'కు మోక్షం

- ఎట్టకేలకు మీసేవ కేంద్రాల్లో రేషన్‌కార్డు దరఖాస్తుల స్వీకరణ
- కొత్తవి, మార్పులు, చేర్పులకు అవకాశం



సుల్తానాబాద్ మీసేవ కేంద్రంలో దరఖాస్తు చేస్తున్న ప్రజలు (ఫైల్)

సుల్తానాబాద్: ఆహార భద్రత కార్డుల కోసం ఎన్నో ఏళ్లుగా ఎదురుచూస్తున్న లబ్ధిదారులకు ఊరట కలిగించేలా రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. 9ఏళ్ల నుంచి ఎదురుచూస్తున్న లబ్ధిదారుల ఆశలు చిగురిస్తున్నాయి. ఇప్పటికే రెవెన్యూ కార్యాలయాల్లో మార్పులు చేర్పుల కోసం దరఖాస్తులు స్వీకరిస్తున్నారు.

మార్పులు, చేర్పులకు అవకావం..

ప్రభుత్వం మూడు రకాల దరఖాస్తులు స్వీకరించేలా అవకాశం కల్పించింది. ఇప్పటివరకు అసలు రేషన్ కార్డు లేని వారు నూతనంగా దరఖాస్తు చేసుకునే అవకాశం కల్పించింది. పాత రేషన్ కార్డులో తల్లిదండ్రుల పేర్లు ఉండి పిల్లల పేర్లు లేని వారు, పెళ్లిల్లు చేసుకున్న మహిళలు పుట్టింట్లో తమ పేర్లు తొలగించి, అత్తగారింట్లో రేషన్ కార్డులో నమోదు చేసుకునే వెసులుబాటు కల్పించింది. వీటితోపాటు ఇతర ప్రాంతాల్లో ఉంటున్న వారు వారి చిరునామా మార్పులు, మీసేవ కేంద్రాల్లో దరఖాస్తు చేసుకునే అవకాశం కల్పించింది. గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో గ్రామసభలు నిర్వహించినప్పుడు రేషన్ కార్డులో పేర్లు రానివారు మాత్రమే దరఖాస్తు చేసుకోవాలని అధికారులు సూచించారు.

సంక్షేమ పథకాలకు కీలకం

రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన అనేక సంక్షేమ పథకాలకు రేషన్ కార్డు లింక్ చేశారు. ఇందిరమ్మ ఇల్లు, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, ఆహార భద్రత కార్డు, గత నెల 21 నుంచి 24 వరకు గ్రామ, పట్టణ సభలు నిర్వహించారు. వాటిని లబ్ధిదారులను చదివి వినిపించారు. అందులో లేనివారు నేరుగా మళ్లీ దరఖాస్తు చేసుకునే అవకాశాన్ని ప్రభుత్వం కల్పించింది.

దరఖాస్తులు స్వీకరిస్తున్నాం



ప్రభుత్వ నిర్ణయంతో మీసేవ కేంద్రాల ద్వారా దరఖాస్తులు స్వీకరిస్తున్నాం. జిల్లావ్యాప్తంగా 164 మీసేవ కేంద్రాల్లో దరఖాస్తులు స్వీకరిస్తున్నారు. గ్రామసభల్లో రేషన్ కార్డు రానివారు గ్రామసభల్లో పేరు రాని వారు మాత్రమే దరఖాస్తు చేసుకోవాలి. – రాజేందర్, డీఎస్‌వో, పెద్దపల్లి



పాలకుర్తి: బసంత్‌నగర్ సమీపంలోని కన్నాల టోల్‌ప్లాజా వద్ద నిర్వాహకుల తీరుతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. టోల్‌ప్లాజా వద్ద ఎగువ, దిగువకు వెళ్లే టోల్ ఫ్రీ వాహనాల కోసం ఇరువైపులా ప్రత్యేక రహదారి ఉంటుంది. ఈదారి గుండా టోల్ రుసుం వర్తించని వాహనాలు మాత్రమే వెళ్లాల్సి ఉంటుంది. అయితే కొన్నిరోజులుగా ఈదారి గుండా ఇతర వాహనాలను పంపిస్తుండడంతో ఆదారి గుండా వెళ్లే వాహనదారులకు దారిలేకుండా పోతోంది. దీంతో ఇరుకుగా ఉన్న ఆదారి గుండా ప్రయాణిస్తుండడంతో ప్రమాదాలబారిన పడే అవకాశాలు ఉన్నాయి. నిర్వాహకులకు టోల్ వసూళ్ల మీద ఉన్న శ్రద్ధ ప్లాజా నిర్వహణ మీద లేదని వాహనదారులు ఆరోపిస్తున్నారు. సంబంధిత ప్లాజా నిర్వాహకులు ఫ్రీ రహదారి గుండా ఇతర వాహనాలను మళ్లించొద్దని వాహనదారులు కోరుతున్నారు.

వాట్సాప్ చేయండి..

మీ ప్రాంతంలో ఉన్న సమస్యను, దానికి సంబంధించిన ఫొటోను మాకు వాట్సాప్‌లో షేర్ చేయండి. ఆ సమస్య ఎప్పటినుంచి ఉందో రాయండి. వాటిని ప్రచురించి సమస్య పరిష్కారానికి 'సాక్షి' కృషి చేస్తుంది. పంపిన వారి పేరు, ఫొటో ప్రచురిస్తాం.

మా ఫోన్ నంబర్లు: 97053 46608, 98499 71500

ఆటోవాలాపై రైల్వే పార్కింగ్ భారం



రైల్వేస్టేషన్ బయట రోడ్డుపక్కన ఉన్న ఆటోవాలాలు (ఫైల్)

- రైల్వేస్టేషన్ స్థాయి ఆధారంగా ఏటా ఛార్జీల వసూలు

రామగుండం: రామగుండం, పెద్దపల్లి రైల్వేస్టేషన్లను కేంద్ర ప్రభుత్వం అమృత్ భారత్ పథకంలో భాగంగా కోట్లాది నిధులతో ఆధునికీకరిస్తోంది. ఈ పనులతో పాటు మరో వైపు అదే స్థాయిలో కేంద్రం ఆదాయ మార్గాలను సైతం అన్వేషిస్తున్నట్లు స్పష్టమవుతోంది. రైల్వేస్టేషన్లలో వివిధ రైళ్లకు రాకపోకలు సాగించే ప్రయాణికులు ఆటోలు, ఇతరత్రా వాహనాలలో స్టేషన్‌కు చేరుకోవడం సహజమే. కానీ ప్రస్తుతం ఆటోలను రైల్వేస్టేషన్ ప్రాంగణంలో పార్కింగ్ చేసేందుకు రైల్వేస్టేషన్ల స్థాయిని బట్టి వార్షిక, అర్ధ వార్షిక గడువుతో పార్కింగ్ ఫీజు వసూళ్లు చేపట్టాలని ఇప్పటికే ఆదేశాలు జారీ చేసింది. 2023 జనవరి 11న సికింద్రాబాద్ డివిజనల్ రైల్వే మేనేజర్, కమర్షియల్ బ్రాంచి, సంచాలన్ భవన్ నుంచి ఆదేశాలు వెలువడ్డాయి. రైల్వేస్టేషన్లలో అభివృద్ధి పనులు నిర్మాణ దశలో ఉండడంతో పార్కింగ్ ఫీజు చెల్లింపునకు ఆటోవాలాలు ముందుకు రావడం లేదు.

పార్కింగ్ ఫీజుల వివరాలు..

రైల్వేస్టేషన్లకు గ్రేడ్స్ నిర్ణయించిన మేరకు ఆటోలు/టాక్సీ వాహనాలకు పార్కింగ్ ఫీజు నిర్ణయించారు. రామగుండం రైల్వేస్టేషన్ ఎన్‌ఎస్‌జీ-3 గ్రేడ్ నిర్ణయించగా అర్ధ వార్షిక పార్కింగ్ ఫీజు ఆటోలకు రూ.3,500, టాక్సీలకు రూ.5,400 ముందుగానే చెల్లించాల్సి ఉంటుంది. పెద్దపల్లి ఎన్‌ఎస్‌జీ-4కు ఆటోలకు రూ.2,500, టాక్సీ వాహనాలకు రూ.3,500, కరీంనగర్ ఎన్‌ఎస్‌జీ-5కు ఆటోలకు రూ.1,500, టాక్సీ వాహనాలకు రూ.2,500 చెల్లించాల్సి ఉంటుంది. పార్కింగ్ ఫీజు చెల్లించే ముందు వాహనానికి సంబంధించిన పూర్తి ధృవీకరణ పత్రాలతో పాటు డ్రైవర్ వివరాలు తప్పనిసరిగా సమర్పించాల్సి ఉంటుంది.

పార్కింగ్ వసూలు సరికాదు

రామగుండం రైల్వేస్టేషన్ ఎంతో అభివృద్ధి చెందుతుందని సంతోషపడ్డాం. కానీ మా ఆటోను కనీసం ప్రాంగణంలోకి కూడా తీసుకువచ్చే పరిస్థితి లేదు. గిరాకీ సరిగా లేదని బాధపడుతున్న క్రమంలో పార్కింగ్ ఫీజు పేరిట వసూళ్లకు పాల్పడడం సరికాదు. దీనిపై ఎంపీ స్పందించాలి. – రహీం, ఆటో యూనియన్ అధ్యక్షుడు, రామగుండం

అభివృద్ధి పేరిట దోపిడీ

రైల్వేస్టేషన్ కొత్తగా కడుతున్నారంటే సంతోషపడ్డాం. కానీ ఈ పరిస్థితి వస్తుందనుకోలేదు. మా వద్ద పార్కింగ్ ఫీజు వసూలు చేయడం నిలువు దోపిడీ చేయడం అన్నట్టే. కేంద్ర రైల్వేశాఖ దీనిపై పునరాలోచన చేయాలి. – రియాజ్, సీనియర్ ఆటోడ్రైవర్, రామగుండం

శ్రీపాదరావుకు నివాళి



నివాళి అర్పిస్తున్న జీఎం బి.వెంకటయ్య

గోదావరిఖని: స్వర్గీయ మాజీ స్పీకర్ శ్రీపాదరావు జయంతి ఆదివారం ఆర్జీ-2 జీఎం కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. కార్యక్రమంలో ప్రాజెక్ట్ ఇంజినీర్ రాజాజీ, ఏరియా సెక్యూరిటీ అధికారి షరీఫ్ మహమ్మద్, డీవైపీఎం వంశీధర్, జీఎం ఆఫీసు సిబ్బంది పాల్గొన్నారు.

జీఎం కార్యాలయంలో..



నివాళి అర్పిస్తున్న ఆర్జీ-3 జీఎం ఎస్.సుధాకర్‌రావు

రామగిరి: ప్రజాశ్రేయస్సు కోసం నిరంతరం తపించిన గొప్ప వ్యక్తి దుద్దిళ్ల శ్రీపాదరావు అని ఆర్జీ-3 జీఎం నరేంద్ర సుధాకర్‌రావు అన్నారు. జీఎం కార్యాలయంలో ఆదివారం ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ స్పీకర్ దుద్దిళ్ల శ్రీపాదరావు జయంతి నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. జీఎం మాట్లాడుతూ శ్రీపాదరావు చేసిన మంచి పనులే ఆయనను జనాల్లో చిరస్థాయిగా గుర్తుండిపోయేలా చేశాయని, నేటి తరానికి ఆయన ఆదర్శమని కొనియాడారు. ప్రాతినిధ్య సంఘం నాయకులు కోట రవీందర్‌రెడ్డి, ఏరియా అధికారుల సంఘం ప్రతినిధి జి.శ్రీనివాస్, అధికారులు కె.ఐలయ్య, షబ్బీరుద్దీన్, సునీల్ ప్రసాద్, రాజేంద్రప్రసాద్, మతీన్ హుస్సేన్, మురళి పాల్గొన్నారు.

పంచాయతీల నిర్వహణ భారం

- నిధులు లేక కుంటుపడుతున్న అభివృద్ధి



కాట్నపల్లి గ్రామ పంచాయతీ భవనం

సుల్తానాబాద్: గ్రామపంచాయతీలో పాలకవర్గాల గడువు ఏడాది క్రితం ముగియగా ఇప్పటివరకు ప్రత్యేక అధికారుల పాలన కొనసాగుతోంది. రికార్డుల ప్రకారంగా ప్రత్యేక అధికారుల పాలన కొనసాగుతున్నప్పటికీ నిధులు రాకపోవడంతో గ్రామాల్లో అభివృద్ధి కుంటుపడుతోంది. పంచాయతీల నిర్వహణకు అవసరమైన నిధులు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విడుదల చేయడం లేదు. పంచాయతీల నిర్వహణకు ఇబ్బంది పడుతున్నామని కార్యదర్శులు ఇబ్బంది పడుతున్నారు. ఇటీవల ఎంపీడీవోలకు, డీఎల్‌పీవోలకు, డీపీవోలకు కలెక్టర్‌కు వారు వినతిపత్రాలు అందించారు.

నిధులు లేక..

జిల్లావ్యాప్తంగా ఉన్న గ్రామపంచాయతీల్లో నిత్యం పారిశుధ్య పనుల నిర్వహణ, రహదారులను శుభ్రం చేయడం, పిచ్చి మొక్కలు పెరగకుండా చూడడం, విద్యుత్ దీపాల క్రమబద్ధీకరణ, తాగునీరు సరఫరా, పల్లె ప్రకృతి వనాలు, నర్సరీలో మొక్కల పెంపకం నిర్వహణ భారంగా మారిందని కార్యదర్శులు వాపోతున్నారు. గత పాలకవర్గాలు పలు రకాల అభివృద్ధి పనులు చేసి బిల్లుల కోసం ఎదురుచూస్తున్నారు. పాలకవర్గాలు ఉంటేనే రాష్ట్ర ఆర్థిక కమిషన్‌కు (సీఎఫ్‌సీ) నిధులు వస్తాయి. పాలకవర్గాల గడువు ముగిసి ఏడాదైనా నిధులు విడుదల కావడం లేదని పంచాయతీ కార్యదర్శులు చెప్తున్నారు. విద్యుత్ దీపాల నిర్వహణ, పైప్ లైన్ల లీకేజీ, పైప్‌లైన్ మరమ్మతులు, పారిశుధ్య సామగ్రి కొనుగోలు, మల్టీపర్పస్ కార్మికుల వేతనాలు, డీజిల్ ఖర్చు భారంగా మారాయని వారు పేర్కొంటున్నారు.

ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తా

గ్రామ పంచాయతీలో నిధుల సమస్య ఉందని, నిర్వహణ భారంగా మారిందని మాకు వినతిపత్రాలు అందాయి. కలెక్టర్ దృష్టికి, ప్రభుత్వ ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తాం. నిధులు విడుదలయ్యేలా ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తాం. – వీర బుచ్చయ్య, డీపీవో, పెద్దపల్లి

ఎన్నికలు వెంటనే నిర్వహించాలి



రాష్ట్ర ప్రభుత్వం స్థానిక సంస్థలకు వెంటనే ఎన్నికలు నిర్వహించాలి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిధులు విడుదల చేయకపోవడంతో పంచాయతీల నిర్వహణ భారంగా మారింది. కార్యదర్శులకు ఇబ్బంది కలగకుండా వెంటనే నిధులు విడుదల చేయాలి. అలాగే ఎన్నికలు వెంటనే నిర్వహించాలి. – పొన్నమనేని బాలాజీరావు, మాజీ ఎంపీపీ, సుల్తానాబాద్

ఘనంగా మాజీ స్పీకర్ శ్రీపాదరావు జయంతి



సుల్తానాబాద్ మున్సిపల్ కార్యాలయంలో..



రామగుండం: అంతర్గాం ఎంపీడీవో కార్యాలయంలో..

పెద్దపల్లిరూరల్/సుల్తానాబాద్/కాల్వశ్రీరాంపూర్/రామగిరి/రామగుండం/జూలపల్లి/ముత్తారం/ధర్మారం/కమాన్‌పూర్/యైటింక్లయిన్‌కాలనీ: జిల్లా వ్యాప్తంగా రామగుండం, పెద్దపల్లి, మంథని నియోజకవర్గాల్లో ఆదివారం ఉమ్మడి రాష్ట్ర శాసనసభ మాజీ స్పీకర్ స్వర్గీయ శ్రీపాదరావు జయంతి ఘనంగా నిర్వహించారు. ఆయన విగ్రహాలకు, చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. మున్సిపల్ కార్యాలయంలో, ఎంపీడీవో, తహసీల్దార్ కార్యాలయాల్లో శ్రీపాదరావు జయంతి వేడుకలు అధికారికంగా నిర్వహించారు. కాంగ్రెస్ నాయకుల ఆధ్వర్యంలో కేక్ కట్ చేశారు.

చేతిపంపునకు మరమ్మతు చేయండి



మార్కండేయ కాలనీలో ఉన్న బోర్‌వెల్

సుల్తానాబాద్: పట్టణంలోని మార్కండేయ కాలనీలో చేతిపంపు చుట్టుపక్కలా గద్దె పగిలిపోవడంతో పాటు తాగునీరు తీసుకెళ్లేందుకు అనుకూలంగా లేదని కాలనీవాసులు వాపోతున్నారు. వేసవిలో తాగునీటికి ఇబ్బందులు కలగకుండా చూడాలని, చేతిపంపునకు మరమ్మతు చేయాలని కోరారు.

నిషేధాజ్ఞలు పొడిగింపు

గోదావరిఖని: సాధారణ పౌరులు.. ప్రధానంగా మహిళలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని రామగుండం కమిషనరేట్ పరిధిలోని మంచిర్యాల, పెద్దపల్లి జోన్‌లలో బహిరంగ ప్రదేశాల్లో మద్యపానంపై అమల్లో ఉన్న నిషేధాజ్ఞలను నెలరోజుల పాటు పొడిగిస్తున్నామని పోలీస్ కమిషనర్ శ్రీనివాస్ ఆదివారం తెలిపారు. మందుబాబుల ఆగడాలపై వస్తున్న ఫిర్యాదుల నేపథ్యంలో ఈ చర్యలు తీసుకున్నామన్నారు. ఏప్రిల్ 1వ తేదీ వరకు నిషేధాజ్ఞలు కొనసాగుతాయన్నారు. డీజేలు, డ్రోన్‌లపై కూడా నెలరోజుల పాటు నిషేధాజ్ఞలు కొనసాగుతాయని పేర్కొన్నారు.

సిటీ పోలీస్‌యాక్ట్ అమలు

రామగుండం పోలీస్‌కమిషనరేట్ పరిధిలో సిటీ పోలీస్‌యాక్ట్ అమలులో ఉంటుందని సీపీ పేర్కొన్నారు. ధర్నాలు, ర్యాలీలు, రాస్తారోకోలు, సభలు, సమావేశాలు నిర్వహించకూడదని, నిర్వహణకు ముందుగా పోలీస్ అధికారుల అనుమతి తీసుకోవాలని ఆయన సూచించారు.

తలుపులు మాయం

సుల్తానాబాద్: మండల కేంద్రంలోని మార్కండేయ కాలనీలో ఉన్న మినీ స్టేడియంలో తలుపులు, కిటికీలను గుర్తుతెలియని వ్యక్తులు మాయం చేశారని క్రీడాభిమానులు వాపోతున్నారు. స్టేడియం తలుపులు, కిటికీలను పునరుద్ధరణ చేసి క్రీడాకారుల సామగ్రి భద్రపరుచుకునేలా అధికారులు చొరవ తీసుకోవాలని క్రీడాకారులు కోరుతున్నారు.



వైభవంగా పోచమ్మ బోనాలు



బోనాలతో మున్నూరుకాపు సంఘం మహిళలు

ఎలిగేడు: మండలంలోని ధూళికట్ట గ్రామం యాస్వాడపల్లిలో మున్నూరుకాపు సంఘం ఆధ్వర్యంలో ఆదివారం పోచమ్మ బోనాలు వైభవంగా నిర్వహించారు. మున్నూరుకాపు సంఘం కుటుంబాల నుంచి ఇంటికో బోనం చొప్పున మహిళలు పోచమ్మ ఆలయానికి తరలివెళ్లారు. ఆలయం చుట్టూ బోనాలతో ప్రదక్షిణలు చేసి పోచమ్మ తల్లికి బోనం మొక్కులు చెల్లించారు. బోనాల వేడుకల్లో మున్నూరుకాపు సంఘం అధ్యక్షుడు పెంచాల సంపత్, ఉపాధ్యక్షుడు అట్టెపల్లి నర్సయ్య, కోశాధికారి చొదరి తిరుపతి, సభ్యులు కాశెట్టి సుమన్, గౌరవ అధ్యక్షుడు అట్టెపల్లి కనుకయ్య, మున్నూరుకాపు సంఘం సభ్యులు, అధిక సంఖ్యలో మహిళలు పాల్గొన్నారు.

లీకేజీతో వృథా పోతున్న తాగునీరు



వృథా పోతున్న తాగునీరు

రామగుండం: పట్టణంలోని విద్యుత్‌నగర్ రోడ్డు వంతెన కింద ఉన్న వాల్వు నుంచి భగీరథ నీరు లీకై వృథాగా పోతోంది. దీనిపై సంబంధిత బల్దియా అధికారులు స్పందించి వాల్వును సవరించి వృథా నీటిని అరికట్టాలని కాలనీవాసులు కోరుతున్నారు.